# చావు

సలీం

నేను పూర్తించి తిరిగొచ్చేటప్పటికి చచ్చిపోయాను. నాకు తెలీకుండానే ఎలా చచ్చిపోయానో ఎంతాలోచించినా అర్థం కావట్లేదు. ఓ రోగమూ లేదు, రొష్టూ లేదు. అకస్మాత్తుగా గుండెపోటుతో చచ్చిపోయేంత బలహీనమైన గుండె కాదు. యాభై నాలుగేళ్ళ వయసున్నా చిన్నప్పటినుండీ బుర్రున చీదెరుగను. కాయకష్టం చేసిన వొళ్ళు, పదహారు మైళ్ళున్న అత్తారింటికి కాలి నడకన ఏకబిగిన వెళ్ళొచ్చిన దారుధ్యం, నాగలి కర్రు పట్టి పొలం దున్నిన చేతులు పదెకరాల మెట్టకూ పాతిక గదుల పెంకుటింటికీ ఆసామిని చేసిన పట్టుదల, నేను నమ్ముకున్న శారీరక శ్రమ... అయినా నేను చచ్చిపోయాను.

వూపిరి ఆడుతున్నట్టు నాకు తెలుస్తూనే ఉంది. భేషుగ్గా శ్వాస తీసుకోగలుగుతున్నాను. గుండె అవిశ్రాంతంగా కొట్టుకుంటూ వుంది. ఎడం ఛాతీపైన చేయుంచుకుని నేనా శబ్దం స్పష్టంగా వినగలుగుతున్నాను. నా కళ్ళు చూడగలుగుతున్నాయి. అదిగో ఎదురుగ్గా నా పెద్ద కొడుకు. వాడి పక్కనే నిలబడి నన్నురిమి చూస్తున్న కోడలు... ఇదుగో వీడు నా చిన్న కొడుకు. వాడి చూపే అదోమాదిరిగుంది. ఓ అపరిచితుణ్ణి చూస్తున్నట్టు చిన్న కోడలి కళ్ళలో ఏహ్యాభావం నన్ను చితిలా కాలుస్తోంది.

నిజంగానే నేను చచ్చిపోయానేమో... లేకపోతే ఇంతమంది నా వాళ్ళనుకున్న కొడుకులూ, కోడళ్ళు చచ్చిపోయానని అబద్ధం ఎందుకు చెప్తారు? అయినా నమ్మబుద్ధి కావటం లేదు. చనిపోయింది మా అన్న కదా! తను స్థిరపడిన తెనాలిలో పక్షం రోజుల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. నేనే కదా దగ్గరుండి కర్మకాండలు జరిపించిందీ... ముగ్గురు కొడుకుల మధ్యన ఆస్తి పంపకాల వ్యవహారాన్ని సజావుగా జరిపించి, వదిన బాగోగులు ఎవరు ఎలా చూసుకోవాలో పెద్దల సమక్షంలో నిర్ణయించాక కదా ఒంగోలుకు తిరుగు ప్రయాణమైనాను?

ఉదయం తెనాలి స్టేషన్లో బస్సెక్కి గంట ప్రయాణం చేసి ఒంగోలు బస్టాండులో దిగి రిక్షా మాట్లాడుకుని సంతపేటలో నా ఇంటి ముందు దిగి ఇన్ని చేయగలిగిన నేను ఎలా చనిపోయినట్లు? గుండె కొట్టుకుంటున్నా, కాళ్ళు కదుల్తున్నా, మనసు ఆలోచిస్తున్నా చనిపోవటం సాధ్యమా? లేక చనిపోయినా భౌతిక శరీరంతో మామూలుగానే పనులు చేసుకునే వీలుందా?

నా వైపు అనుమానంగా మోసగాణ్ణి చూస్తున్నట్టు చూస్తున్న పెద్ద కొడుకు వైపు తిరిగి ముచ్చటగా మూడోసారి చెప్పాను "ఒరేయ్ రావుడూ! నేనురా మీ నాన్నని. మీకేమైనా పిచ్చి పట్టిందిరా? నేను బతికే ఉంటే చచ్చిపోయానంటారేమిటి? ఈసారి నా గొంతులో కొద్దిగా కోపం ధ్వనించింది.

"మా నాన్న చచ్చిపోయి పదిహేను రోజులైంది. చితికి నిప్పు పెట్టింది నేనే"

"మరి నేనెవర్ని?"

ఏమో! మాకెలా తెలుస్తుంది? వెళ్ళు వెళ్ళి మీ వాళ్ళనెవర్నయినా పట్టుకుని ఆ ప్రశ్న అడుగు".

"నాకు మీరు తప్ప నా వాళ్ళంటూ ఇంకెవరు



న్నారు?" అంటూ చిన్న కొడుకు వైపు తిరిగి "ఒరేయ్ కిష్టుడూ! నువ్వయినా చెప్పరా... నేను... నన్ను గుర్తు పట్టలేదా? మీ నాన్నని. ఈ గుండెలమీద కదరా నిన్నూ, నీ అన్ననీ ఆడించిందీ... ఇదిగో చెవి ఆనించి విను. గుండె ఆడుతోంది. నేను బతికే ఉన్నా" అన్నాను.

"నువ్వు బతికి లేవని మేమనటం లేదు. మా నాన్న పదిహేను రోజుల కింద చచ్చిపోయాడని అంటున్నాం. నేనూ, రావుడన్నయ్యా ఆస్తి పంపకాలు కూడా చేసుకున్నాం. నువ్వెవరో మాకు తెలీదు. చనిపోయిన మా నాన్న బతికెలా వస్తాడు? నీకు మతి చలించిందేమో పరీక్ష చేయించుకో" అన్నాడు వాడు.

నాకు గుండె పట్టేసినట్లయింది. పదిహేను రోజుల క్రితం చనిపోయానో లేదో తెలీటం లేదు కానీ ఇపుడు నిజంగానే గుండెపోటొచ్చి చచ్చిపోతాననిపించింది. ఓవేళ వాడన్నట్టు నా మతేమైనా చెడిందా? నాకేమైనా పిచ్చిపట్టి నేనెవర్నో మర్చిపోయానా? తెనాలిలో చనిపోయింది నా అన్న కాదా...నేనా? అదెలా సంభవం?

"ఒరేయ్ కళ్ళు పోయాయేమిట్రా? బతికున్న తండ్రిని పట్టుకుని చచ్చిపోయాడనటానికి మీకు నోరెలా వస్తుందిరా? వూరేమైనా గొడ్డు పోయిందా? పదిమందిని పిలువు. నిజమేమిటో తేలిపోతుంది" నా కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరగటం వల్లనుకుంటాను వాళ్ళు నాకు బూజరగా కన్పించారు.

"పదిమందినీ పిలవాల్సిన అవసరం లేదు. మా నాన్న కట్టె పూర్తిగా కాలేవరకూ ఉండి, మరునాడెళ్ళి బూడిద తెచ్చింది నేనే. ఇదుగో రాగిచెంబులో మా నాన్న అస్థికలు. మా నాన్న చచ్చిపోయాడు. అయ్యో నాన్నా! నన్నూ, తమ్ముణ్ణి అనాథల్ని చేసి వెళ్ళిపోయావా?" రావుడు నెత్తి బాదుకుంటూ ఏడుస్తున్నాడు.

వాడి ఏడుపు చూశాక నాకెందుకో వాళ్ళు చెప్తున్నదే నిజమేమోననిపించింది. బిక్కమొగం వేసుకుని నిలబడి ఉన్న ఇద్దరు మనవళ్ళనీ, మనవరాలినీ ఆరిపోని ఆశతో అడిగాను "నేనెవరో మీరైనా గుర్తుపట్టారా?"

వాళ్ళలో అందరికంటే చిన్నది రెండేళ్ళ భాను నోరు విప్పేలోపల చిన్న కోడలు దాని మీపు మీద ఫెడీఫెడీమని నాలుగు అంటించి "నోరెత్తావా చంపేస్తానే ముదనష్టపుదానా! తాతయ్య చనిపోయాడే. ఎవరో ముక్కూ మొహం తెలీని పరాయి వ్యక్తి వచ్చి పిచ్చివాగుడు వాగుతున్నాడు. మీరందరూ లోపలికి తగలడండి" అంటూ దాన్ని బరబరా ఇంట్లోకి లాక్కెళ్ళింది.

మినుకు మినుకుమంటున్న నా ఆశ చప్పగా చల్లారిపోయింది.

"నీ కసలు బుద్ధుందా? ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదా? నువ్వు బతికే ఉన్నావు మహాప్రభో. సలక్షణంగా బతికే ఉన్నావు. చనిపోయింది మా నాన్న. వెంకటేశు, మున్సిపల్ అధికారులు మా నాన్న చనిపోయినట్లిచ్చిన మరణ ధృవీకరణ పత్రం చూపించనా? ఉండిక్కడే" రావుడు ఇంట్లోపల కెళ్ళాడు.

నేను చనిపోయినట్లు ప్రభుత్వం ధృవీకరించిందా? నేను బతికేవున్నా కదా! నేను చనిపోయానో లేదో చూడకుండానే చనిపోయానని మున్సిపల్ అధికారులు ఎలా సర్టిఫై చేశారు? కళ్ళున్న నా కొడుకులూ, కోడళ్లే నేను చనిపోయానని నమ్మకంగా చెప్తున్నప్పుడు, కళ్ళు లేని ప్రభుత్వాధికారులేం చేస్తారు? అయినా ఓ మనిషిని నిలువునా రికార్డుల్లో చంపేస్తున్నప్పుడు ఆ మాత్రమైనా జాగర్తపడరా? చంపటం మాటలనుకున్నారా? అంటే ఎవర్నంటే వారిని ఎప్పుడంటే 'అప్పుడు చంపేస్తారా? ఇది హత్యే. మరి శిక్ష ఎవరికి? చంపబడిన వాడికా? నా ఆలోచనలు నాకే అస్తవ్యస్తంగా అన్పించాయి.

"ఇదిగో ఈ డెత్ సర్టిఫికెట్ చూసుకో. మా నాన్న, వెంకటేశు పదిహేను రోజుల క్రితం గుండెనొప్పితో చనిపోయినట్లు రాసి సంతకం పెట్టి ఉంది" ఓ కాగితాన్ని నా మొహం మీదకు

విసిరేస్తూ అన్నాడు రావుడు "నీలాంటి మోసగాళ్ళుంటారని తెలిసే జిరాక్సు తీయించి పెట్టాను. ఇకనైనా గొడవ చేయకుండా ఫో. లేకపోతే పోలీసుల్ని పిలవాల్సొస్తుంది".

నాకు చాలా దుఃఖం వచ్చింది. నేను చచ్చిపోయానని ఒక ప్రభుత్వ అధికారి సంతకం పెడితే, బతికే ఉన్న నన్ను చావగొట్టటానికి మరో అధికారి వస్తాడట. నేను చచ్చిపోయాను కదా! రానీ వెధవని! చచ్చిపోయిన నన్నెలా కొడ్తాడో చూస్తాను.

నాతో చిన్నప్పటి నుండీ కలిసి పెరిగిన నేస్తాలు పక్కింటి రాఘవులూ, ఎదురింటి మస్తానయ్య గుర్తొచ్చారు. వాళ్ళదీ అటూ ఇటుగా నా ఈడే. ఇక్కడ ఇంత రభస జరుగుతున్నా నాకు సపోర్టుగా వాళ్ళిద్దరూ ఎందుకు రాలేదూ? ఇంట్లో లేరా? అసలు వూళ్లో లేరా? ఆ యిళ్ళలోంచి ఆడంగులు రెండు మూడుసార్లు బైటికొచ్చి తొంగిచూసి వెళ్ళడం నేను గమనించాను. మరి నా సావాస గాళ్ళేరీ? నా ఆప్తమిత్రులేరీ? నా ఆపద్బాంధవులేరీ?

నేను ఆశగా రాఘవులు ఇంటి వైపుకు నడిచి బైటినుంచి పెద్దగా కేక పెట్టాను. రెండు మూడుసార్లు పేరు పెట్టి పిలిచాక "ఎవరూ" అంటూ బెరుగ్గా బైటికొచ్చాడు రాఘవులు. కళ్ళద్దాలు సవరించు కుంటూ నావైపు ఎగాదిగాచూసి "ఎవరు కావాలి?" అన్నాడు.

నాకు కోపం నసాళానికెక్కింది. "నీ దుంపతెగ! నేనురా వెంకటేశుని. నీ బాల్య స్నేహితుణ్ణి" అతనికి దగ్గరగా వెళ్ళబోతూ అన్నాను. అతను భయంగా రెండడుగులు వెనక్కివేశాడు.

"అలా భయపడ్తావేమిట్రా? నేనేమీ దయ్యాన్ని కాదు. నేను బతికే ఉన్నాను"

"నా చిననాటి స్నేహితుడు చనిపోయిన దుఃఖంలో ఉంటే ఇపుడా పరాచికాలు? నువ్వేం పెద్దమనిషివి? పోపో" అన్నాడు రాఘవులు. అతని కళ్ళలో భయం నగ్నంగా కన్పిస్తోంది.

నాకు పిచ్చెక్కినట్లనిపించింది. మస్తానయ్య ఇంటివైపుకు పరుగెత్తాను.

"ఒరేయ్ మస్తాన్! నువ్వయినా నిజం చెప్పరా? ఇదంతా గందరగోళంగా ఉంది రా. నా తల ఆలోచనల్తో పగిలిపోయేట్టుంది. నేను బతికుండగానే చచ్చిపోయానని నా కొడుకు అస్థికలు రుజువులుగా చూపిస్తున్నాడురా. చివరికి మన రాఘవులు కూడా వాడికి వంత పాడ్తున్నాడు. నీకు దండం పెడ్తాన్రా. నేను బతికున్నానని నువ్వయినా చెప్పరా" అన్నాను వాడి చేతులు పట్టుకుంటూ.

వాడు నా చేతుల్ని బలంగా విదిలించి కొట్టాడు. "ఎవడ్రా నువ్వు? మా వెంకటేశు చచ్చిపోయి పదిహేను రోజులైంది. తండ్రి పోయిన దిగుల్తో పిల్లలు సతమతమౌతుంటే ఎవర్ని మోసం చేద్దామని ప్లానేసుకుని వచ్చావురా? ఇక్కడినుంచి తక్షణం వెళ్ళిపో. లేకపోతే నా కొడుకులూ, రాఘవులి కొడుకులూ కలిసి నిన్ను చావగొడ్తారు".

కన్నీళ్ళూ, కోపం కలగాపులగంగా తన్నుకొచ్చాయి.

నన్ను చావగొడ్తార్రా! ఒరేయ్. మీరందరూ కల్సి నన్ను పదిహేన్రోజుల క్రితమే చంపేశారు కదరా! మళ్ళా కొత్తగా చావగొట్టటానికి నేను మిగల్లేదు కదరా! నా కొడుకు నన్ను బూడిద చేశాడుగా! మీరందరూ మనిషిని బతికుండగానే పీక్కుతినే రాక్షసుల్రా. థూ! మీ బతుకులు



చెడ..." కోపంలో నోటికొచ్చినట్లు తిట్టాను.

నాకు వాళ్ళ కుట్ర అర్థమైంది. ఇదంతా కావాలని ఆడుతున్న స్వార్థ నాటకం. నా స్వార్జితం నేను బతికుండగా అనుభవించే అవకాశం లేదని, నా కొడుకులిద్దరూ నన్ను బతికుండగానే చంపేశారు.

కథ

మరి నా మిత్రులో...! వాళ్ళకేం మాయ రోగం వచ్చింది? నా కొడుకులు విసిరేసిన డబ్బుకి కక్కుర్తి పడి అబద్ధం చెప్తున్నారా? ఈ సంకట స్థితిలో ఆదుకుంటారనుకుంటే వాళ్ళూ నా గుండెల్లో చెరో కత్తి పోటు పొడిచారు.

మెదడు మరిగేలా ఆలోచిస్తున్న నాకు ఓ విషయం స్ఫురణకొచ్చింది.

రెణ్ణెల్ల క్రితం రాఘవులు తన కూతురు పెళ్ళికని నా దగ్గర చేబదులుగా ఇరవై వేలు తీసుకున్నాడు. "ఇదే చివరాఖరిది. దీనికి పెళ్ళి చేసి అత్తారింటికి పంపిస్తే గుండెలమీద బరువు దిగిపోతుందిరా. మంచి సంబంధం. ఎటొచ్చీ ఓ ఇరవై వేలు అప్పు చేయాల్సి వచ్చేట్టుంది. నాకు నువ్వు తప్ప ఇలాంటి కష్టమొచ్చినపుడు ఆదుకునేవాళ్ళెవరున్నారు చెప్పు? నీ కాడపిల్లలు లేరని నువ్వు కూడా అదింతున్నప్పటినుంచీ నీ కూతురిలా చు-స్కున్నావు కదరా! నువ్వే ఎలాగోలా చేసి ఈ శుభకార్యం సజావుగా జరిగేట్టు చూడరా" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమైతే పంట అమ్మితే వచ్చిన రొక్కంలోంచి అడిగిన ఎమ్మట్నే ఇరవై వేలు తీసిచ్చాను. నోటి మాట తప్ప నోటు రాయించుకోవాలన్న ఆలోచనే రాలేదు. చివరికి నా కొడుకులక్కూడా చెప్పకుండా పైకం సర్దాను. ఆ ఇరవై వేల బాకీ తీర్చాల్సి వస్తుందని కుట్ర పన్ని దుష్టులైన నా కొడుకుల్తో చేతులు కలిపి ఉంటాడు.

మస్తానయ్య కూడా నాకు బాకీ ఉన్నాడు. పదివేలు! నాలుగు నెలల క్రితం జబ్బు పడితే కొడుకులిద్దరూ ఆస్పత్రిలో చేర్చారు. కడుపులో గడ్డ పెరిగిందనీ, ఆపరేషన్‌కి పది వేలౌతుందనీ డాక్టర్లు చెప్పగానే "ఎయ్యో రెండేలో ఐతే ఎలాగోలా కిందా మీదా పడి కట్టేవాళ్ళం. పదేలంటే మాకాడ ఏణ్ణుం చొస్తాయి? మావల్ల కాదు" అంటూ ఒకరొకరు మెల్లగా జారుకున్నారు. చూసొద్దామని ఆస్పత్రికెళ్ళిన నా రెండు చేతులూ పట్టుకుని మస్తానయ్య వలవలా ఏడ్చాడు. "చూశావురా! ఎంకటేశు - ఈ రెక్కలు ముక్కలు చేసుకుని కదరా వీళ్లని పెంచాను. ఆపరేషన్ చేయకపోతే చచ్చిపోతాన్రా. చచ్చిపోతే పాడె మోయడానికి నా కొడుకులిద్దరూ తయారుగా ఉన్నారు. నువ్వు నా ప్రాణ స్నేహితుడివి. నన్ను బతికించుకోరా. నీ రుణం ఉంచుకోన్రా. నెలకు ఐదొందల చొప్పున వాయిదాలుగా తీర్చుకుంటాన్రా" అంటూ ప్రాధేయపడితే మొత్తం పన్నెండు వేలు సర్దాను. ఈ నాలుగు నెలల్లో రెండు వేలు వసూలైంది. మిగిలిన పదివేలు ఎగ్గొట్టొచ్చని వాడి వెధవైడియా.

వాళ్ళు నన్నెందుకు చంపేశారో అర్థం కాగానే నా కోపాన్ని, అసహ్యాన్ని దాచుకోలేకపోయాను.

"ఛీ! మీరు మనుషులు కాదురా! మీకన్నా పందులు నయం. నా బాకీ తీర్చాల్సి వస్తుందని కదరా మీరిలా నాటకమాడ్తున్నారు? మీరేం స్నేహితుల్రా? మీకసలు స్నేహమంటే తెలుసట్రా?

నాతో ఒక్కమాట "ఒరేయ్ ఎంకటేశూ, నీ బాకీ తీర్చలేంరా! అనుంటే మన స్నేహం కోసం ఆ డబ్బుని వదులుకొనుండేవాణ్ణి. మీరూ వదులుకున్నారు డబ్బుకోసం చిన్ననాటి స్నేహితుణ్ణి. ఛీ! మిమ్మల్ని చూస్తుంటేనే ఒళ్ళు కంపరంగా ఉంది. ఒరేయ్ మస్తాన్! నువ్వు ఏ చేతుల్నైతే పది నిముషాల క్రితం విదిలించి కొట్టావో ఆ చేతుల్ని పట్టుకుని బతిమాలితే కదరా నీకు ప్రాణం పోశాను. ఇపుడు బతికున్న నా ప్రాణాలు తీయటానికి నీకు మనసెలా ఒప్పిందిరా? ఒరేయ్ రాఘవులూ! మీరు చేసిన పాపం వూరికే పోదురా! మీరింతకింతా అనుభవిస్తార్రా. లోకంలో కొడుకులు దుర్మార్గాలు చేసినా ఇంకా స్నేహధర్మం బతికే ఉందని ఇన్నాళ్ళూ నమ్మానా. మిమ్మల్ని ఇలా వదిలిపెట్టను. మీ అంతు చూస్తాను. ఒరేయ్ మీరందరూ నీచులురా, గోతికాడి నక్కలు మీకన్నా నయంరా......! పుల్లిస్తరాకులు నాకే కుక్కలు కూడా మీకన్నా నయంరా" ఆవేశంలో ఏమేం తిట్టానో నాకే గుర్తు లేదు.

ఎన్ని తిట్టినా కడుపు మంట చల్లారటం లేదు. అప్పుడు గుర్తొచ్చింది ఆకలి. కరకరలాడుతూ ఆకలి. ఉదయం ఆరింటికి బయల్దేరే ముందు తిన్న రెండిడ్లీలు. ఇపుడు సమయం మధ్యాహ్నం రెండు కావస్తోంది. నా కొడుకుల్లా వికృతంగా హింసిస్తూ ఆకలి. నా స్నేహితుల్లా కండల్నీ, గుండెల్నీ నమిలి తినేస్తూ ఆకలి. ఇపుడు అన్నం ఎవరు పెడ్తారు?

నాకిప్పుడు ఇల్లు లేదు. నా అనేవాళ్ళే లేరు. పదిహేను రోజుల క్రితం వరకూ నాకిద్దరు ఎదిగిన కొడుకులుండేవారు. విసుక్కున్నా పూటికింత వండిపెట్టే ఇద్దరు కోడళ్లుండేవారు. మన వళ్ళూ, మనవరాళ్లూ ఉండేవారు. ఇపుడు ఎవ్వరూ లేరు. నేను చనిపోయానట. అంతేనా లేక వాళ్ళు నాకు చనిపోయారా? ఎవరు చనిపోయి ఎవరు బతికున్నారు? ఎలా చూసినా ప్రస్తుతం నేను ఒంటరిని. అనాథని. కాలుతున్న కడుపుకింత గంజి పోసేవాళ్ళు కూడా లేని అభాగ్యుడిని.

బాధతో జమిలిగా కలిసిపోయి కసీ కోపమూను. నేను కని భూమ్మీదకు తెచ్చిన నా కొడుకులకు బుద్ధి చెప్పాలి. నా స్వార్జితమైన పదెకరాల భూమిని స్వాధీనపర్చుకుని నాకు నిలువ నీడ లేకుండా చేసిన వీళ్ళని మాత్రం వదలకూడదు. బతికున్నా బతుకు లేకుండా చేసిన దుర్మార్గులు వాళ్ళు.

గమ్యం లేకుండా నడుస్తున్నాను. ఎండ నిర్దయంగా మండుతోంది. కడుపులో ఆకలి అగ్ని గుండంలా మండుతోంది. వీటికన్నా నా గుండె మంట వంద రెట్లు అధికంగా ఉంది.

కన్నీళ్ళతో పాటు జ్ఞాపకాలు జలజలా రాల్తున్నాయి.


రావుడు పుట్టే సమయానికి ఒంగోలుకు మకాం మార్చలేదు. కరపదిలో ఉండేవాళ్ళం. మట్టిరోడ్డు కూడా సరిగ్గా లేని పల్లెటూరది.

నొప్పులు తెరలు తెరలుగా వస్తున్నాయంటే మంత్రసాని యింటికెళ్ళి వెంటుండి పిల్చుకొచ్చాను.

మెలికలు తిరిగిపోతున్న నా భార్య బాధ చూడలేక కండువాతో కళ్ళొత్తుకుంటున్న నన్ను చూసి మంత్రసాని నవ్వింది. "తొలి చూలు కదా! పెసవం కావాలంటే ఆ మాత్తరం నొప్పులు పడకుండా కుదర్దు" అంది.

లోపలికెళ్ళాక "పెద్దగా కేకలేయకు. నీ పెనిమిటి బయంతో సెమటలు కక్కుతున్నాడు" అన్న మంత్రసాని అర్ధగంట గడవకముందే చెమటలు కక్కుకుంటూ బైటికొచ్చి "బిడ్డ అడ్డం తిరిగాడు. కాన్పు కట్టమయ్యేట్టుంది. ఆసుపత్రికి పిల్చుకెళ్లు. నా చాతకాదు" అంటూ జారుకుంది.

ఎడ్లబండి కట్టుకుని ఒంగోలుకు బయ



ల్దేరాం. రాత్రి తొమ్మిది దాటి ఉంటుంది. చీకటి... అమావాస్య చీకటి. మెల్లగా ప్రారంభమైన వర్షం కుండపోతగా మారింది. దానికి తోడు వేగంగా వీస్తూ ఈదురు గాలి. నేను మొక్కుకోని దేవుడు లేడు.

నా భార్య బాధతో ఉంగలు చుట్టుకుని పోతోంది.

"నేను చచ్చిపోతున్నా. నా పేనం పోయినా పర్లేదు. బిడ్డ బతికితే చాలు" అంటూ ఒకటే ఏడుపు.

ఆసుపత్రి గేటు దగ్గరకు చేరేటప్పటికి అది మాటామంతీ లేకుండా పడిపోయింది. చచ్చిపోయిందనే అనుకున్నా. కొనప్రాణంతో ఉండిందని తర్వాత డాక్టర్ చెప్పాడు. వారం రోజులు ఆసుపత్రిలో ఉంటే కానీ అది కోలుకోలేకపోయింది.

దుష్టశక్తులు జన్మించే ముందు కొన్ని చెడు శకునాలు కన్పిస్తాయంటారు. అమావాస్య... అర్థరాత్రి... చీకటి... గాలివాన... తీతువు పిట్ట అరుపు. మాకు రాక్షస అంశతో కొడుకు పుట్టాడని తెలీక వెర్రివాళ్ళలా ఎంత సంబరపడ్డామో. వాడు భూమ్మీదకు రావటం కోసం దానికి నరకం చూపించి, చంపేసినంత పని చేశాడు. అది వారానికైనా కోలుకుంది. ఇపుడు వాడు కొట్టిన చావు దెబ్బ నుంచి, గుండె కోత నుంచి నేనెప్పటికైనా కోలుకోగలనా?

రెండోవాడు మరో ఆకు ఎక్కువే చదివాడు. పుట్టూనే వాళ్ళమ్మ ప్రాణాల్ని పిడికిళ్ళతో పిండుకుని మరీ కళ్ళు తెరిచాడు. తల్లిలేని పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకొచ్చాను. నాలా పొలం పన్లు చేయలేరని చదివినంత మేరా చదివించాను. అదే తప్పు చేశాననిపిస్తోంది. వాళ్ళ చదువులు సంస్కారాన్ని నేర్పాల్సింది పోయి జల్సాల్ని నేర్పాయి. సున్నితత్వానికి బదులు స్వార్థం వంట బట్టింది.

పొలం పనికి పంపినా బావుండేదేమో! కష్టమంటే ఏవిటో తెలిసేది. నేలతో అనుబంధం తెలిసొచ్చేది. పంటను చూసినప్పుడు పొంగుకొచ్చే వాత్సల్యం తెలిసేది. మానవత, మమకారాలు అర్థమయ్యేవి.

గత రెండు సంవత్సరాలుగా పోరుతున్నారిద్దరూ. పదెకరాల భూమిని అమ్మి రొక్కం వాళ్ళ చేతుల్లో పోయాలట. "ఈ మట్టి పిసుక్కునే పని మా చేత కాదు. నామోషీ కూడా. విత్తనాలు నాటాక వర్షం వస్తుందో రాదోననే దిగులుతో ఆకాశంకేసి పిచ్చోళ్ళకు మల్లే చూస్తూ కూచోవడం మాకు రాదు. నీ తదనంతరం మాలో ఎవ్వరం వ్యవసాయం చేయం. అందుకే అమ్మేయి" అన్నారు.

"నేను భూమిని నమ్ముకున్నోణ్ణి. మీ సరదాలకోసమో, మీ భార్యల గొంతెమ్మ కోరికలు తీర్చటం కోసమో నేల తల్లిని దూరం చేసుకోను" అన్నాను.

"అంటే నీ ఉద్దేశం ఏమిటి? నీ రక్తం పంచుకు పుట్టిన మాకన్నా నీకు పొలమే ఎక్కువన్మాట. మామీద నీకు నమ్మకం లేదనేగా అర్థం. మేమైనా ఏమంటున్నామని? ఈ వయసులో పొలంపని, కాయకష్టం వద్దంటున్నాం. నేను కానీ, తమ్ముడు కానీ నీకు తిండి పెట్టమని అన్నామా?" రావుడు తగాదాకు దిగాడు.

"నేనలా అనలేదు. నా వొంట్లో ఇంకా సత్తువుంది. పంట పండించడంలో శ్రద్ధా ఉంది. నా కొడుకుల సంపాదన మీద ఆధారపడాల్సి

న అగత్యం ఇంకా రాలేదు" అన్నాను.

రెండోవాడే కలుగజేసుకుని ఇప్పుడు సత్తు వుందని మురిసిపోవటం కాదు. ముసలితనంలో నీకింత ముద్ద పడేయాల్సింది మేమేనన్న విషయం మర్చిపోకు. మామాట విని పొలం అమ్మేయి. ప్రస్తుతం డబ్బులవసరం చాలా ఉంది" అన్నాడు.

వాడి బెదిరింపు నాకర్థమైంది.

నా బొందిలో ప్రాణముండగా పొలాన్ని అమ్మనని తెగేసి చెప్పాను.

ఇపుడు బొందిలో ప్రాణమైతే ఉంది. కాని నేను వాళ్ళకి చచ్చిపోయాను. ప్రభుత్వం దృష్టిలో కూడా చచ్చిపోయాను.

నేనిపుడు నేను కాదు. వెంకటేశు చచ్చిపోయాడు.

వూరికి దక్షిణాన ఉన్న స్మశానం నోరు తెర్చుకుని నావైపు చూస్తోంది. నాకోసం సమాధి కూడా కట్టి ఉంటారు. ఏదీ నా సమాధి? నా కొడుకులు ప్రేమతో కట్టిన సమాధి? ఇటుకల్తో కట్టారా? లేక చలువ రాతితోనా?

ఓ సమాధి మీద కూచున్నాను. దీనికింద ఏ తండ్రి హృదయం ప్రశాంతంగా సేద తీరుతోందో... బతికుండీ కొడుకుల చేతుల్లో నానా చావు చావడంకన్నా చనిపోవడం నయమనుకున్న ఏ తండ్రో, తల్లో అయి ఉంటారనిపించింది. నాలో చనిపోవాలనే బలమైన కోరిక... చనిపోయిన వీళ్ళందర్నీ చూసి అసూయ... కొడుకులు వీళ్ళ గుండెలకిక తూట్లు పొడవలేరు. పదునైన మాటల్తో పరపరా కోయలేరు. తమ కర్కశ చేష్టల్తో బొందితో చితిపైకి చేర్చలేరు.

నేనెలాగూ చనిపోయినట్టే లెక్క. బతికున్నా చనిపోయిన నేను నిజంగా చనిపోయి చనిపోతాను.

ఇంతకూ నేను నేనేనా? నిజంగానే బతికున్నానా లేక నిజంగానే చనిపోయానా?

నాకు మరలా కోపం వచ్చింది. విపరీతమైన కోపం. కొడుకులమీద... కోడళ్ళమీద... వ్యవస్థ మీద. కుట్రల మీద... కుళ్ళు కంపు కొడ్తున్న మానవ సంబంధాల మీద...

ఆవేశంగా మున్సిపల్ ఆఫీసు మెట్లెక్కాను. జనన మరణాల్ని నమోదు చేసుకుని ధృవీకరణ పత్రాలిచ్చేది ఎక్కడో కనుక్కుని అక్కడికెళ్ళి గుమాస్తా ఎదురుగా నిలబడ్డాను.

అతను అసహనంగా తలయెత్తి చూసి చిరాగ్గా "ఏం కావాలి?" అని అడిగాడు.

"నేను నీ కళ్ళకు కన్పిస్తున్నానా?" అని అడిగాడు.

అతను దెయ్యంలా నవ్వి "నువ్వు కన్పించటంలేదని ఎవరైనా వేళాకోళమాడారా? లేక నీకే నువ్వు ప్రేతాత్మవేమోననే అనుమానం వచ్చిందా? పాదాలు వెనక్కి తిరిగిలేవు. నువ్వు గాల్లో తేలుతూ రాలేదుగా. మనిషివే. అనుమానం లేదు. నా కళ్ళకు చక్కగా కనిపిస్తున్నావు" అన్నాడు.

"నేను బతికున్నానా? చచ్చిపోయానా?"

అతనీసారి విసుగ్గా మొహం పెట్టి "తాగొచ్చావా? నాకు చాలా పని ఉంది. వెళ్ళెళ్ళు" అన్నాడు.

"మొదట నా ప్రశ్నకు సమాధానం చెప్పు. నేను బతికున్నానా లేదా?"

"నువ్వెక్కడ దొరికావయ్యా రంకు మగడా. నువ్వు బతికే ఉన్నావు. చాలా...ఇక వెళ్ళు"

"మరి ఇదేమిటి?" నా పెద్ద కొడుకు నా మీదకు విసిరేసిన డెత్ సర్టిఫికెట్‌ని అతని ముందుంచాను.

**"నేను బతికే ఉన్నాను. ఒరేయ్! నేను చచ్చిపోలేదురా. బతికే ఉన్నాన్రా. ఒరేయ్ ఆఫీ సరూ...! లంచానికాశ పడి నన్ను చంపేశావు కదూ! నిన్నిలా వదిలిపెట్టన్రా. కోర్టుకీడుస్తాను. నీ బండారం బైట పెడ్తాను" కసి తీరా తిట్టాను**

అతను నావైపూ, ఆ కాగితంవైపూ మార్చి మార్చి చూశాడు. ఏమనుకున్నాడో ఏమో చివరికా కాగితాన్ని చేతిలోకి తీసుకుని చదివాడు. నా కళ్ళలోకి చూస్తూ "ఓ...! నీకు చదువు రాదా? అలా చెప్పొచ్చుగా నా ప్రాణాలు తీయక పోతే. పదిహేను రోజుల క్రితం వెంకటేశు అనే యాభై నాలుగేళ్ళ వ్యక్తి గుండెపోటుతో మరణించినట్లు ధృవీకరిస్తూ మేము జారీ చేసిన పత్రమిది" అన్నాడు.

"మరి నేనెవర్ని?"

"నువ్వెవరో నాకెలా తెలుస్తుందయ్యా?"

"నేనే ఆ వెంకటేశుని"

"ఏ వెంకటేశు?"

"పదిహేను రోజుల క్రితం చనిపోయిన వెంకటేశు"

అతను మొదట ఆశ్చర్యంతోనో, భయంతోనో "ఆ" అంటూ నోరెళ్ళబెట్టాడు.

"నన్ను చూశావుగా. నేను బతికే ఉన్నాను. ఇది మార్చి, బతికే ఉన్నట్టు నాకు మరో సర్టిఫికెట్ ఇవ్వు"

అతను నావైపు ఎగాదిగా చూశాడు. "ఇది ఆఫీసు వ్యవహారం. ఆషామాషీ కాదు. నువ్వు నువ్వేనని మాకు రుజువులు కావాలి. చనిపోయిన సదరు వెంకటేశు నువ్వూ ఒకటేనని సాక్ష్యం కావాలి. నీ వాళ్లెవరైనా వచ్చి నువ్వు చావలేదనీ, బతికే ఉన్నావనీ చెప్పాలి" అతను కొద్దిసేపు పెచ్చులూడిపోయిన గోడలవైపూ, దుమ్ము పేరుకుపోయిన ఫైళ్ళవైపూ చూస్తూ దీర్ఘంగా ఆలోచించి చెప్పాడు. "అయినా మా రికార్డుల ప్రకారం సదరు వెంకటేశు చచ్చిపోయాడు. అతన్ని బతికించటం సాధ్యం కాదు. రూల్సు ఒప్పుకోవు".

నేనతని పై అధికారిని కల్సుకున్నాను. అతను ఫైలు తెప్పించి చూశాడు. నాకు నచ్చచెప్తున్న ధోరణిలో "ఇదిగో ఈ కాగితం ఉంది చూశావూ తన తండ్రి గారైన వెంకటేశు చనిపోయినట్లు రాముడనేవాడు రాసిచ్చిన అర్జీ. మా ఇన్‌స్పెక్టర్ చేసిన ఎంక్వయిరీ రిపోర్టిది. వెంకటేశు ఇంట్లోని వ్యక్తులే కాకుండా చుట్టుపక్కల ఇళ్ళల్లోని రాఘవులూ, మస్తానయ్య చేసిన సాక్షి సంతకాలివిగో. దహన వాటికలో సదరు వెంకటేశుని కాల్చినట్టు ఇదిగో రసీదు కాపీ" అన్నాడు.

"అవన్నీ సరే. నేను మాత్రం చావలేదు, బతికే ఉన్నాను"

"నేనేమీ చేయలేను. సదరు వెంకటేశు చనిపోయాడు. గవర్నమెంటు రికార్డుల్నించీ, ఓటర్ల జాబితా నుంచీ అతని పేరు తొలగించబడింది".

"చనిపోయినవాళ్ళు చనిపోయారని ధృవీకరించే మీరు, నేను చనిపోకున్నా చనిపోయానని సర్టిఫికెట్ జారీ చేయగల మీరు, బతికున్న నేను బతికే ఉన్నానని ఎందుకు రాసివ్వరు? మీరలా రాసిచ్చే వరకూ నేనిక్కణ్ణుంచి కదలను? మొండికేసి అతనెదురుగ్గా బైఠాయించాను.

"ఏమిటీ వెధవ న్యూసెన్స్" అంటూ బెల్లు మోగించాడు. ఇద్దరు జవాన్లొచ్చి నా చెరో రెక్కా పట్టుకుని బరబరా బైటికీడ్చేశారు.

"నేను బతికే ఉన్నాను. ఒరేయ్! నేను చచ్చిపోలేదురా. బతికే ఉన్నాన్రా. ఒరేయ్ ఆఫీసరూ...! లంచానికాశపడి నన్ను చంపేశావు కదూ! నిన్నిలా వదిలిపెట్టన్రా. కోర్టుకీడుస్తాను. నీ బండారం బైట పెడ్తాను" కసి తీరా తిట్టాను. పోలీసుల్ని పిలిచి జైల్లో పెట్టిస్తామని బెదిరించారు.

నాకేం చేయాలో పాలు పోలేదు.

మొదట కడుపుకింత తిండి సంపాయించుకోవాలి. పదెకరాల భూమికి ఆసామినైన నేను అదే వూరిలో కూలికెళ్ళటం నామోషీ అన్పించి కరపది వెళ్ళి వ్యవసాయ కూలీగా చేరాను. కాయకష్టం చేసిన వొళ్ళు, శారీరక శ్రమకన్నా గుండెకైన గాయం వ్రణంలా సలుపుతూ నా కొడుకులు చేసిన అన్యాయం మనసుని దహిస్తూ...


ఓటమిని ఒప్పుకోదల్చుకోలేదు. కాగితాల మీద చచ్చిపోయానేమో కానీ నా జవసత్వాలు, ఆత్మాభిమానం సజీవంగానే ఉన్నాయి. నేను పోరాడటానికే నిర్ణయించుకున్నాను.

తినీ తినక డబ్బుని కూడబెట్టటం ప్రారంభించాను. ఒకటే ధ్యేయం. నాకన్యాయం చేసిన నా కొడుకులకీ, స్నేహితులకీ బుద్ధి చెప్పాలి. ఒకటే లక్ష్యం. నేననేవాణ్ణి బతికే ఉన్నానని రుజువు చేసుకోవాలి.

కొంత డబ్బు జమైనాక దిన పత్రికల్లో ఓ ప్రకటన వేయించాను. నా ఫోటో కింద "నేను చావలేదు. బతికే ఉన్నాను" అని రాయించాను. చచ్చినవాళ్ళ ఫోటోలు వేస్తారు. కానీ ఇలా బతికున్నానంటూ ఫోటోలేమిటి? అని నవ్వుకున్న వాళ్ళూ ఉన్నారు. ముసలాడికి పిచ్చి పట్టిందని జాలిపడ్డవాళ్ళూ ఉన్నారు.

జనన మరణ ధృవీకరణ ఆఫీసరు గారికి ఓ అర్జీ పెట్టుకున్నాను. "నేను బతికే ఉన్నాననీ, గత కొన్ని నెలల క్రితం ఇచ్చిన మరణ ధృవీకరణ పత్రాన్ని ఉపసంహరించుకోమని".

**(మిగతా 29వ పేజీలో)**



# భ్రమర కీటక న్యాయం

వన్యప్రాణులు

'భ్రమర కీటక న్యాయం' అన్నారు పెద్దలు. భ్రమరం ఒక గొంగళి పురుగును తీసికొనివచ్చి, మట్టితో గూడు కట్టి అందులోని దానిని బంధిస్తుంది. తరవాత కొంత కాలానికి గూడునుంచి కందిరీగ బయట పడుతుంది. ఇదెక్కడి న్యాయం? గొంగళి పురుగును ఏ మాయాజాలానికి గురి చేసి అలా న్యాయభంగం కలిగించింది?

కందిరీగ మనకి సామాన్యంగా కనబడే కీటకం. పురాణాల్లో శకుంతలని సయితం గాభరా పెట్టిందని వింటాం. ఇళ్లల్లో దూరి ఎక్కడ తన గూడు పెడదామా? అని అన్వేషిస్తుంది. కందిరీగలు తేనెటీగలకి దగ్గర బంధువులే. భ్రమరం అనేపదం ఈ రెండిటికే వర్తిస్తుందేమో. అంతేకాదు ఈ రెండూ చీమలకి కూడా చేరువైనజాతులే. చెదపురుగులుమాత్రం (White Ants) వీటికి దగ్గర కాదు. ఈ కీటకాలు సామాజిక లక్షణంలో ప్రసిద్ధికెక్కాయి. చీమలు తేనెటీగలు విషయంలో (చెదపురుగులకు సయితం) ఈ లక్షణం ప్రస్ఫుటంగా కనబడినా కందిరీగల విషయంలో మాత్రం ఒంటరి కందిరీగలు సామాజిక కందిరీగలు అనే విధానం కనబడుతుంది. ఒంటరి జాతులే అధికం.

చీమలు వాటి దవడలతో కుడతాయి. కాని తేనెటీగలు, కందిరీగలు వాటి కొండి తోకుడతాయి. ఇది వాటి శరీరం వెనక ఉంటుంది. ఇక్కడ విశేషమేమంటే తేనె టీగల్లో పని ఈగలు ఉంటాయి. ఇవి వాస్తవానికి స్త్రీజాతికే చెందినా వంధ్యలుగా మారిపోతాయి. గుడ్లుపెట్టే వాటి అండనిక్షే పము ప్రయోజనం కోల్పోయింది. అందుకని ఒక తీవ్రమైన విషకొండిలా మారిపోతుంది. అయితే తేనెటీగ కొండి బావిలో వడ్డ బాల్చీ తీయడానికి ఉపయోగపడే గాలంలా ఉంటుంది. కుట్టిందంటే తేనెటీగ పని సరి. మన బాధ ఎలా ఉన్నా దాని కొండి బయటకు రాదు. తేనెటీగ శరీరం చీరుకొనిపోతుంది. కందిరీగకి ఈ ఇబ్బంది లేదు. దాని కొండి సునాయాసంగా వచ్చేస్తుంది. కందిరీగలు మగ, ఆడ కేవలం సంతానోత్పత్తి సమయంలోనే కలుసుకొంటాయి. తరవాత విడిపోతాయి. తల్లే సంతాన బాధ్యత తీసికొంటుంది. కొన్ని జాతుల కందిరీగలు సామాజిక లక్షణం పెంపొందించుకొన్నాయి. వాటిలో మాత్రం రాణిఈగ, పని ఈగలు ఉంటాయి. వేలాది ఈగలు ఒకచోట నివసిస్తాయి. అతి పురాతనమైన కందిరీగని 'వెల్వెట్ చీమ' అంటారు. (బొమ్మ)

ఆడవాటికి రెక్కలుండవు. చీమల్లాగే కనబడతాయి. వెంట్రెకలున్న చీమల్లా ఉంటాయి. కేవలం కొన్ని ఇతర జాతుల కీటకాల శరీరాల్లో గుడ్లు పెట్టి తమపని పూర్తి చేసుకొంటాయి. గూడు కట్టవు. శ్రద్ధావుండదు. కొన్ని కందిరీగ జాతులు గూడు పెడతాయి.

'అమ్మొఫిలా' అనే జాతి కందిరీగ మరింత ముందడుగు వేసింది. ఒక్క గూడు నిర్మించి ఊరుకోదు. ఆ గూడులో ఇంకా-ఇంకా అధికంగా కీటకాలని మూర్ఛకి గురి చేసి దాస్తుంది. ఇలా ఎన్నో గూళ్లు ఒకచోట నిర్మిస్తుంది. ఇలా చేయడంవల్ల సంతానం వయసులో తేడా వస్తుంది. అది దృష్టిలో ఉంచుకొని సంతాన పోషణ కార్యక్రమం నిర్వర్తిస్తుంది. వయసును బట్టి తగినంత ఆహారం సమకూర్చడంలో నేర్పరితనం చూపుతుంది. ఇంకా చాలా అభివృద్ధి చూపే కందిరీగ జాతులు చాలా ఉన్నాయి.

ముఖ్యంగా గమనించవలసినది భ్రమర కీటక న్యాయం ఏమిటాఅని. కీటకం లేదా గొంగళి పురుగును మూర్ఛకి గురిచేసినవైనం అది చచ్చిపోకూడదనే ధ్యాసతోనే. అలాంటి ఆహారాన్ని సేవించి తన స్వంత గుడ్డు నుంచి డింభకం బయటపడి భ్రమరం బయటపడుతుంది. ఇదే విడ్డూరం. ఒక పురుగు లేదా కీటకం నుంచి భ్రమరం బయట పడింది. ఇదే భ్రమర కీటక న్యాయం. వాస్తవానికి అన్యాయం.

**- జమ్మి కోనేటిరావు**

# చావు

(23వ పేజీ తరువాయి)

ఎన్నాళ్ళు ఎదురు చూసినా సమాధానం రాకపోవటంవల్ల కోర్టులో కేసు వేశాను. "సదరు వెంకటేశు అనే నేను బతికే ఉన్నట్టు తీర్పునివ్వవలసిందిగా" కోర్టు వారిముందు విన్నవించుకున్నాను.

నా అనుకున్నవాళ్ళు నేను చచ్చిపోయానని మొఖం మీదే చెప్పేశారు. సదరు వెంకటేశు అనే నేను చచ్చిపోయినట్టు మున్సిపల్ అధికారి సంతకం పెట్టి, దాని మీద సీలు వేసి మరీ చెప్పాడు. ఇక నాకు మిగిలిన ఆశ కోర్టు తీర్పు ఒక్కటే. కేసు వేసిన రోజు నుంచీ ఎదురు చూపే. నేను బతికే ఉన్నానని కోర్టు ముఖతా ఎప్పుడు వింటానా అని.

వెంకటేశు అనే వ్యక్తి గవర్నమెంటు రికార్డుల ప్రకారం చనిపోయాడనీ, చనిపోయిన వ్యక్తి కోర్టునెలా ఆశ్రయించగలడనీ జడ్జీగారు మల్లగుల్లాలు పడ్డారు. ప్రభుత్వం దగ్గర ఉన్న సాక్ష్యాధారల వల్ల వెంకటేశు అనే వ్యక్తి చనిపోయినట్టు రూఢిగా తెలుస్తోంది కాబట్టి చనిపోయిన వ్యక్తి తాను బతికే ఉన్నట్లు చెప్పుకోవటం సాధ్యం కాదు కాబట్టి ఆత్మరూపంలో అఫిడవిట్ దాఖలు చేసి ఉంటాడేమోననుకోవటం హేతువుకు విరుద్ధం కాబట్టి ఈ కేసును అడ్మిషన్ చేసుకోకుండా కొట్టేస్తున్నామని కోర్టువారు తీర్పు చెప్పారు.

నేను అధైర్యపడి నా ప్రయత్నాన్ని ఆపదల్చుకోలేదు. నేను బతికే ఉన్నానని రుజువు చేసేవరకూ విశ్రాంతి తీసుకోను.

నేను కష్టపడి, డబ్బు కూడగట్టుకుని సంపాయించుకున్న పదెకరాల భూమి లాగేసుకున్నందుకు బాధగా లేదు. నా యింటిని నాకు కాకుండా చేసినందుకు దిగులుగా లేదు. నాకు నా అనేవాళ్ళు లేకుండా పోయినందుకూ దుఃఖం రావటం లేదు. కడుపుకింత కూడు పెట్టే వాళ్ళు కరువైనందుకు చింతలేదు. కాని నన్ను నేను కాకుండా చేశారే! అందుకు బాధ పడ్తున్నాను.

ఇపుడు నేననేవాణ్ణి బతికేవున్నానని రుజువు చేసుకోవటం చచ్చే చావుగా ఉంది నాకు. ఓరోజు సాయంత్రం నా మనవళ్ళు చదువుకుంటున్న స్కూలుకెళ్ళాను. పిల్లలందరూ గ్రౌండ్‌లో ఆడుకుంటున్నారు. పదేళ్ళ, పన్నెండేళ్ళ నా మనవలిద్దరూ నన్ను చూసి బిక్కమొగాలేసి నిలబడ్డారు.

"ఒరేయ్! నన్ను గుర్తు పట్టలేదట్రా. నేనురా... ఇప్పటికైనా చెప్పండిరా నేనెవరో! ఈ గుండె కోతని భరించటం ఇక నావల్ల కాదురా" అన్నాను. నాకు తెలీకుండానే కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"మాకు తెలీదు అమ్మకొడ్తుంది. నువ్వెళ్ళిపో" అంటూ వాళ్ళు వెనక్కెనక్కి వెళ్తున్నారు. తోటి నర్సరీ పిల్లల్తో ఆడుకుంటున్న భాను నన్ను చూసి పరుగెత్తుకుంటూ వచ్చింది. దాని కళ్ళు సంతోషంతో మెరుస్తున్నాయి.

నాకు ప్రాణం లేచొచ్చినట్టనిపించింది. "తల్లీ...! నీకైనా నేను తెలుసా?" అన్నా గద్గద స్వరంతో.

అది నోరు తెరవబోతున్నప్పుడు "భానూ! అమ్మ కొడ్తుంది. నాన్న కూడా కోప్పడతాడు. నువ్వతనితో ఏమీ మాట్లాడకు తన అన్నలవైపో క్షణం చూసింది.

తల తిప్పి నా వైపు చూసి ఉషోదయం లాంటి తన అద్భుతమైన నవ్వుని ఉదారంగా వెదజల్లుతూ...పరుగెత్తుకుంటూ వచ్చి నా కాళ్ళని చుట్టేసింది. "తాతయ్యా! మరే మమ్మీడాడీకేం తెలీదు. అన్నలక్కూడా తెలీదు. నాకు తెల్సు తాతయ్యా. నువ్వు మా తాతయ్యవి".

జలజలా రాలిన నా కన్నీటి బిందువులు భాను తల మీద అక్షింతలుగా మెరిశాయి.

●